

ప్రైవేటు ఆస్పత్రుల్లో టాస్క్‌ఫోర్స్ తనిఖీలు

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి పట్టణంలోని పలు ప్రైవేటు ఆస్పత్రులను స్టేట్ టాస్క్‌ఫోర్స్ టీమ్ గురువారం తనిఖీలు చేసింది. పోతిరెడ్డిపల్లిలోని రెండు ఆస్పత్రులతో పాటు ఫసల్‌వాది శివారులోని మరో ఆస్పత్రిని తనిఖీ చేసినట్టు సమాచారం. ఆయా ఆస్పత్రుల్లో క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్టు అమలులో భాగంగా ట్రీట్‌మెంట్‌చార్జీల వివరాల ప్రదర్శన, అనుమతులు, డాక్టర్లు, సిబ్బంది వివరాలను క్షుణంగా పరిశీలించి పలు రికార్డులను స్వాధీనం చేసుకున్నట్టు తెలిసింది.



సైలెన్సర్ల మోత..

రోలర్‌తో వాత

- బైక్ సైలెన్సర్ల మార్పిడితో శబ్ద కాలుష్యం
- ఆకతాయి యువత ఆగడాలు
- కొరడా ఝుళిపించిన పోలీసులు
- సైలెన్సర్ల ధ్వంసం
- మూన్నాళ్ల ముచ్చటగానే ఈ చర్యలు..!
- మళ్లీ యథావిధిగా మోత మోగిస్తే ఎలా?

5

ఐబీ గెస్ట్‌హౌస్ గోడను తొలగించి రోడ్డును వెడల్పు చేయండి

సంగారెడ్డి బైపాస్ రోడ్డు పనుల్లో వేగం పెంచాలి

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి ఐబీ గెస్ట్ హౌస్ గోడను తొలగించి బైపాస్ రోడ్డును మరింత వెడల్పు చేయాలని, విస్తరణ పనుల్లో వేగం పెంచాలని టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సూచించారు. పట్టణంలోని ఐబీ గెస్ట్ హౌస్ నుంచి బసవేశ్వర విగ్రహం వరకు మూడు కిలోమీటర్ల పనులను నాణ్యతతో చేపట్టాలని చెప్పారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనులు పూర్తిచేయాలని సూచించారు. నాలుగు చోట్ల జంక్షన్లను ఆకర్షణీయంగా నిర్మించాలన్నారు.





బైపాస్ రోడ్డు విస్తరణ పనులను పరిశీలిస్తున్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల, జగ్గారెడ్డి, ఐబీ గెస్ట్‌హౌస్ గోడను కూల్చివేయాలని సూచిస్తున్న జగ్గారెడ్డి



జిన్నారం మున్సిపల్ వార్డుల డీ-లిమిటేషన్ డ్రాఫ్ట్‌ను ప్రకటిస్తున్న కమిషనర్ తిరుపతి, సిబ్బంది

మున్సిపాలిటీ వార్డుల

డీ-లిమిటేషన్ డ్రాఫ్ట్ ప్రకటన

జిన్నారంలో 20, ఇంద్రేశంలో 18 వార్డులు

పటాన్‌చెరు/జిన్నారం, అక్టోబరు 16, (ఆంధ్రజ్యోతి): నూతనంగా ఏర్పాటైన మున్సిపాలిటీల్లో వార్డుల విభజన డీ-లిమిటేషన్ డ్రాఫ్ట్‌ను ప్రభుత్వం ప్రకటించింది. జిన్నారంలో 20, ఇంద్రేశంలో 18 వార్డులు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. జిన్నారం మున్సిపల్ కమిషనర్ తిరుపతి, సిబ్బంది గురువారం డ్రాఫ్ట్‌ను కార్యాలయం ఆవరణలో నోటీసు బోర్డులో ప్రకటించారు. మున్సిపాలిటీలో 12,578 మంది ఓటర్లు ఉండగా 20 వార్డులను ఖరారు చేశారు. ఒక్కో వార్డులో 600 వందల నుంచి 660 మంది వరకు ఓటర్లుగా నిర్ధారించారు. ముసాయిదా డ్రాఫ్ట్‌పై అభ్యంతరాలను ఈ నెల 23 వరకు తెలియజేయాలని కమిషనర్ తిరుపతి పేర్కొన్నారు. అలాగే, ఇంద్రేశం పురపాలక సంఘాన్ని 18 వార్డులుగా విభజించారు. ఇంద్రేశం, బచ్చుగూడ, రామేశ్వరంబండ, ఐనోలు, పెద్దకంజర్ల, చిన్నకంజర్ల గ్రామాలతో పురపాలక సంఘంగా ఏర్పాటు చేశారు. ఆరు గ్రామాలను కలిపి 18 వార్డులుగా విభజన చేశామని కమిషనర్ మధుసూదన్‌రెడ్డి చెప్పారు.

తలాపునే మంజీర.. అయినా

తీరని దాహార్తి

- నీటికోసం అల్లాడుతున్న మెతుకుసీమ
- జిల్లా కేంద్రంలో తీవ్ర ఎద్దడి
- సింగూరు నుంచి నీటి సరఫరాలో లోపం
- డిమాండ్‌లో సగమే అందుబాటులో..
- పంపింగ్‌లో వేగం తగ్గడంతో ఎగువ ప్రాంతాలకు చేరని నల్లా నీరు
- శీతాకాలంలోనే నీటి కోసం ఇబ్బందులు



మెదక్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): తలాపున మంజీర నది ప్రవహిస్తున్నా తాగునీటి కోసం మెతుకుసీమ వాసులు తహతహలాడాల్సి వస్తోంది. సింగూరు నీటి సరఫరా క్రమం తప్పిపోవడంతో లక్ష జనాభాకు నీరందని పరిస్థితి దాపురించింది. ఇళ్లలో సంపులు, బ్యారెళ్లు, తొట్టెల్లో నీరు నింపుకుని వారాలు గడిచిపోయిందని ప్రజలు వాపోతున్నారు. జిల్లా కేంద్రంగా ఆవిర్భవించిన అనంతరం మెదక్ పట్టణం వేగంగా విస్తరిస్తోంది. కొత్త కాలనీలు ఏర్పడ్డాయి. జనాభా పెరిగింది. కొత్తగా వందలాది ఇళ్ల నిర్మాణాలు జరిగాయి. చుట్టుపక్కల మండలాల నుంచి వచ్చినవారు పట్టణంలో స్థిరపడ్డారు. జనాభా లక్షకు చేరుకుంది. కానీ, ప్రజల డిమాండ్‌కు సరిపడా నీరు సరఫరా లేకపోవడంతో నీటి కోసం నానా అవస్థలు పడుతున్నారు. మిషన్ భగీరథ ప్రాజెక్ట్ కింద మెదక్ పట్టణానికి సింగూరు ప్రాజెక్టు నుంచి పైప్‌లైన్ ద్వారా మంజీరా జలాలను అందిస్తున్నారు. ప్రతీరోజు 10 ఎంఎల్‌డీ నీటి డిమాండ్ ఉంటుంది. కానీ, నెల రోజులుగా కేవలం 5.65 ఎంఎల్‌డీ నీరే అందుతోంది. దీంతో నీటి సరఫరా వేగం తగ్గిపోయి ఎత్తయిన ప్రాంతాలకు చుక్కనీరు కూడా అందడం లేదు. దాయర, గాంధీనగర్, సాయినగర్, ఫతేనగర్, వెంకట్రావ్‌కాలనీ, హౌసింగ్‌బోర్డ్, తారకరామాకాలనీ, పిట్లంబేస్, నవాబ్‌పేట, బాబాకాలనీ తదితర ప్రాంతాలవాసులు తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారు. ఉదయం వేళల్లో కేవలం పది నిమిషాలు మాత్రమే నీరు వదిలి బంద్ చేస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శాంతినగర్, గాంధీనగర్ తదితర స్లమ్ ఏరియాలకు నీటి ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేస్తున్నారు మున్సిపల్ తాగునీటి విభాగం సిబ్బంది. సింగూర్ నుంచి మెదక్ వరకూ వేసిన నీళ్ల పైప్‌లైన్ల వ్యవస్థలో అనేక లీకేజీలు ఏర్పడడంతో నీరు అందడం లేదని మున్సిపల్ ఇంజనీర్లు చెబుతున్నారు. సింగూరు పంప్‌హౌస్‌లో మోటార్ల పనితీరులో తరచుగా అంతరాయం ఏర్పడుతుండటంతో సరఫరాకు ఆటంకం ఏర్పడుతున్నది.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లకు బ్రేక్

మెదక్ పట్టణంలోని హల్దీవాగులో ఉన్న పంప్‌హౌస్‌లో గతంలో ఏర్పాటుచేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు కరెంటు సరఫరా చాలాకాలంగా నిలిచిపోయింది. విద్యుత్ బిల్లుల భారం తప్పించుకునేందుకు

మిగతా 6వ పేజీలో

విధుల్లో నిర్లక్ష్యం..

హెచ్‌ఎం, ఇద్దరు టీచర్ల సస్పెన్షన్

నర్సాపూర్,అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన హెడ్‌మాస్టర్‌తో పాటు మరో ఇద్దరు ఉపాధ్యాయులను సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యాధికారి రాధాకిషన్ ఉత్తర్వులు జారీ చేశారు. నర్సాపూర్‌లోని జూనియర్ కాలేజీ ఆవరణలో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న హెచ్‌ఎం అశోక్, ఉపాధ్యాయులు లక్ష్మణ్, రాచప్ప విధుల పట్ల నిర్లక్ష్యం వహించినందుకు గురువారం డీఈవో రాధాకిషన్ సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎంతో పాటు ఇద్దరు ఉపాధ్యాయులు విధులకు సక్రమంగా హాజరు కావడం లేదని ఈ మధ్యనే తల్లిదండ్రులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కలెక్టర్ ఆదేశాల మేరకు తూప్రాన్ ఎంఈవో సత్యనారాయణ ఆధ్వర్యంలో విచారణ చేశారు. ఈ విచారణలో సదురు ఉపాధ్యాయులు విధులన్నీ పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని తేలడంతో విచారణ నివేదిక జిల్లా అధికారులకు సమర్పించారు. ఈ నివేదిక ఆధారంగా హెచ్‌ఎంతో పాటు ఇద్దరు ఉపాధ్యాయులను సస్పెండ్ చేస్తు డీఈవో ఉత్తర్వులు జారీ చేశారు.



నేటి నుంచి వనదుర్గమ్మ దర్శనం

పాపన్నపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): దుర్గామాత మూల విరాట్ దర్శనం కోసం ఎదురుచూస్తున్న భక్తులకు శుభవార్త. శుక్రవారం నుంచి గర్భగుడిలో అమ్మవారి దర్శనం కల్పించనున్నట్లు అధికారులు తెలిపారు. గర్భగుడి వరదల్లో చిక్కుకోవడంతో రాజగోపురంలో అమ్మవారి ఉత్సవ విగ్రహానికి దర్శనం కల్పించారు. నీటి ప్రవాహం తగ్గడంతో అమ్మవారి ఆలయాన్ని శుభ్రం చేసి, దర్శనానికి అనుమతి కల్పిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి పేర్కొన్నారు. దీంతో, ఇకపై భక్తులకు గర్భగుడిలో స్వయంభుగా వెలసిన దుర్గామాత మూలవిరాట్‌ను దర్శించుకునే భాగ్యం దక్కనుంది.

'సెక్యూరిటీ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి'

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డిలోని ఎంసీహెచ్ ఆస్పత్రి సెక్యూరిటీ సిబ్బంది రాత్రిపూట అప్రమత్తంగా ఉండాలని జీజీహెచ్ సూపరింటెండెంట్ మురళీకృష్ణ సూచించారు. 'దవాఖానాకు వస్తే జేబులు గుల్ల' అనే శీర్షికతో ఈ నెల 14న 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి ఆయన స్పందించారు. ఆస్పత్రి సెక్యూరిటీ సిబ్బందితో గురువారం సమావేశం నిర్వహించారు. ఎంసీహెచ్‌లో రోగులు, సహాయకుల సెల్‌ఫోన్, బైక్, నగదు చోరీలు జరుగుతుంటే ఏంచేస్తున్నారని సెక్యూరిటీని ప్రశ్నించారు. సెక్యూరిటీ లోపాలను సహించేది లేదని హెచ్చరించారు. రాత్రిపూట నిఘా పెంచాలని, అపరిచిత వ్యక్తులను లోపలికి అనుమతించవద్దని సూచించారు. పాసులు లేకుండా ఎవరినీ లోనికి అనుమతించవద్దని ఆదేశించారు. సెక్యూరిటీ సిబ్బంది రోగులు, సహాయకుల వద్ద డబ్బులు అడిగినట్లు ఫిర్యాదు వస్తే ఉద్యోగాల నుంచి తొలగిస్తామని హెచ్చరించారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

త్వరలోనే అందుబాటులోకి క్రిటికల్‌కేర్ బ్లాక్

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ప్రాంగణంలో నిర్మించిన క్రిటికల్ కేర్ బ్లాక్‌ను త్వరలో అందుబాటులోకి తెస్తామని జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.మురళీకృష్ణ తెలిపారు. 'మంత్రి ప్రారంభించినా..వినియోగంలోకి రాలే' అనే శీర్షికన గురువారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈ మేరకు డాక్టర్లు, ఆర్‌ఎంవోలతో కలిసి ఆస్పత్రి సూపరింటెండెంట్ క్రిటికల్ కేర్ బ్లాక్‌ను సందర్శించారు. క్రిటికల్ కేర్ బ్లాక్‌లో రోగులకు అత్యవసర వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడానికి చేపట్టాల్సిన అవసరాలు, చర్యలను పరిశీలించారు. కాగా ఉన్నతాధికారులు కూడా ఈ విషయంపై ఆరా తీసినట్టు తెలిసింది.

మళ్లీ గులాబీ జెండా ఎగరాలి

స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలకు బుద్ధి చెప్పాలి

మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు



బీఆర్ఎస్‌లో చేరినవారిని ఆహ్వానిస్తున్న మాజీ మంత్రిహరీశ్‌రావు

మునిపల్లి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో సంగారెడ్డి జిల్లాలో గుండాజెండా ఎగురవేయాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండల పరిధిలోని చిన్నచెల్మెడ, బోడపల్లి గ్రామాల తాజా మాజీ సర్పంచ్ గాడికాన విజయ్ భాస్కర్, చాట్ల బిందు రామక్రిష్ణతోపాటు పెద్దలోడి నరేష్, తక్కడపల్లి సత్తయ్య, బొడశట్‌పల్లి అక్రమ్, అశోక్, ఆయా గ్రామాలకు చెందిన 50 మంది బీఆర్ఎస్, బీజేపీ నాయకులు గురువారం బీఆర్ఎస్‌లో చేరారు. అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు జైపాల్ రెడ్డి, పైతర సాయికుమార్ ఆధ్వర్యంలో హరీశ్‌రావు వారిని గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరినవారికి కండువా కప్పి పార్టీలో ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఆరు గ్యారంటీల పేరుతో హామీ ఇచ్చి అన్నివర్గాలను ప్రభుత్వం మోసం చేస్తోందన్నారు. నిరుద్యోగులు నోటిఫికేషన్ల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. ఏడాదికి రెండు లక్షల ఉద్యోగాలు అన్నమాట నీటి మూటలుగా మారాయని విమర్శించారు. పెన్షన్లు పెంచుతామని చెప్పి ఇప్పటివరకు పెంచకపోవడం విడ్డూరంగా ఉందని అన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చూపించాలని బీఆర్ఎస్ శ్రేణులకు సూచించారు. కాంగ్రెస్ హామీలను నెరవేర్చే వరకు పోరాటం చేయాలన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో తీసుకెళ్లి బీఆర్ఎస్ పార్టీ బలపర్చిన అభ్యర్థులను గెలిపించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో మునిపల్లి తాజా, మాజీ జడ్పీటీసీ పైతర మీనాక్షి సాయికుమార్, నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు చిట్కుల వెంకటేశం, గడ్డం భాస్కర్, శ్రీనివాస్, ప్రభు, దత్తుగౌడ్, రాజు, మొగులయ్య, ఒగ్గు మోహన్, బొడశట్‌పల్లి దత్తు, పెద్దలోడిరాజు, ప్రేమ్, బాగన్న, అఫ్సర్, నవీన్, ఇబ్రహీం, సుధాకర్, అంజి తదితరులు పాల్గొన్నారు.

పనులు పూర్తయిన వెంటనే ఇందిరమ్మ ఇళ్ల బిల్లులు

నిర్మాణాల పురోగతిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ ధాన్యం కొనుగోళ్లు

మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

పాపన్నపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల బిల్లులను దశలవారీగా లబ్ధిదారులకు అందేలా అధికారులు కృషిచేయాలనీ మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. పాపన్నపేట మండలంలో గురువారం ఆయన పర్యటించారు. పొడ్చన్‌పల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని, ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. ఇప్పటి వరకు పూర్తయిన వివరాలను వెంటవెంటనే ఆన్‌లైన్‌లో నమోదుచేసి బిల్లులు విడుదల చేయాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి ఏర్పాట్లపై ఆరా తీశారు. ఇప్పటివరకు వచ్చిన ధాన్యం, గోనె సంచుల నిల్వకు సంబంధించిన రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. ఎలాంటి సమస్యలు తలెత్తకుండా కొనుగోళ్లు సాఫీగా సాగాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.



పాపన్నపేట మండలం పొడ్చన్‌పల్లిలో ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

జహీరాబాద్‌లో ఐడీఎస్‌ఎంటీ బాధితుల ఆందోళన

జహీరాబాద్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): అధికారులు, నాయకులను నమ్మి పైసా పైసా కూడబెట్టుకుని కొనుగోలు చేసిన తమ ప్లాట్లను, ఇళ్లను కూల్చివేయడం ఏమిటని బాధితులు ఆందోళనకు దిగారు. జహీరాబాద్‌లో మున్సిపల్ కార్యాలయం ఎదుట గురువారం ఐడీఎస్‌ఎంటీ ప్లాట్ల బాధితులు ఆందోళన చేపట్టారు. పలువురు బాధితులు మాట్లాడుతూ ఐడీఎస్‌ఎంటీ కాలనీలోని 158 సర్వే నంబర్‌లో 19 ఎకరాల భూమి ఉండగా అందులో పదెకరాలు తమదంటూ కొందరు న్యాయస్థానం ఉత్తర్వులను తీసుకువచ్చి ఇళ్లను, రోడ్లను ధ్వంసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. స్థలం ప్రైవేటు వ్యక్తులదైనప్పుడు ఫీజులను తీసుకుని రిజిస్ట్రేషన్లుచేసి తమనెందుకు తప్పుదోవ పట్టించారని అధికారులు, నాయకులను ప్రశ్నించారు. నష్టపోయిన 150 మంది ప్లాట్ల బాధితులకు న్యాయంజరిగే వరకు కదలబోమంటూ మున్సిపల్ కార్యాలయానికి తాళం వేసి బైఠాయించారు. మున్సిపల్ అధికారులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీఐ శివలింగం, ఎస్‌ఐ వినయ్‌కుమార్, కాశీనాథ్ సిబ్బందితో చేరుకుని ఆందోళనకారులను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అక్కడా వారు ఆందోళనకు దిగడంతో మున్సిపల్ కమిషనర్ సుభాష్ రావు వచ్చి బాధితుల తరఫున న్యాయపోరాటం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.



జహీరాబాద్ మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న బాధితులు



జోగిపేటలో మాట్లాడుతున్న జరీటా లైత్‌ఫ్లాంగ్

డీసీసీ అధ్యక్షుడి ఎన్నికల్లో

కార్యకర్తల అభిప్రాయమే ఫైనల్

ఏఐసీసీ పరిశీలకురాలు జరీటా లైత్‌ఫ్లాంగ్

జోగిపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తల అభిప్రాయం మేరకే జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడి ఎన్నిక జరుగుతుందని, ఇందుకోసమే క్షేత్రస్థాయిలో అభిప్రాయ సేకరణ జరుపుతున్నామని ఏఐసీసీ పరిశీలకురాలు జరీటా లైత్‌ఫ్లాంగ్ పేర్కొన్నారు. జోగిపేటలోని కాంగ్రెస్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన అభిప్రాయ సేకరణలో ఆమె జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు, పీసీసీ ఉపాధ్యక్షుడు సంగమేశ్వర్‌తో కలిసి మాట్లాడారు. కార్యకర్తలంతా ప్రజల్లో ఉండే వ్యక్తినే డీసీసీ అధ్యక్షుడిగా ఎన్నుకోవాలని సూచించారు. డీసీసీ అధ్యక్షుడి ఎంపికలో ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలవారికి ప్రాధాన్యం ఉంటుందన్నారు. మహిళలకు 30 శాతం సీట్లు కేటాయిస్తామని వివరించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎంపిక జరగాలన్నదే అధిష్ఠానం అభిమతమన్నారు. అందుకే దేశవ్యాప్తంగా డీసీసీ అధ్యక్షుల ఎంపిక కోసం 'సంఘటన్ సృజన్ అభియాన్' కార్యక్రమాన్ని పార్టీ చేపడుతోందన్నారు. డీసీసీ అధ్యక్షుడిగా ఎన్నుకోబడే వ్యక్తి 50 సంవత్సరాలు నిండినవారై ఉండాలన్నారు. ఆశావహులు ఈ పదవి కోసం ఈ నెల 18 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇలా దరఖాస్తు చేసుకున్నవారికి సంగారెడ్డి పట్టణంలోని రెడ్లాస్ హోటల్‌లో ఇంటర్వ్యూలు నిర్వహించి, వారిలో నుంచి ఆరుగురిని ఎంపిక చేసి ఏఐసీసీకి పంపుతామన్నారు. రాహుల్ గాంధీ, మల్లిఖార్జున ఖర్గేల ఆధ్వర్యంలో వారిలో ఒకరిని డీసీసీ అధ్యక్షుడుగా ఎంపిక చేస్తారన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య యాదవ్, ఏఎంసీ చైర్మన్లు జగన్మోహన్ రెడ్డి, మంతూర్ సుధాకర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జీఆర్ నరేందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు శివరాజ్‌యాదవ్, దుర్గారెడ్డి, పిల్లోడి సతీష్, నాయకులు సురేందర్‌గౌడ్, డీజీ వెంకటేశం, చిట్టిబాబు, డాకూరి శంకర్, గంగాధర్ అశోక్, చిట్యాల మధు, గొల్ల శరత్, భాస్కర్, రాజశేఖర్, గోహర్ అలీ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పొన్నం చనిపోయారని దుష్ప్రచారం

● బీఆర్ఎస్ నాయకురాలిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు


పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

హుస్నాబాద్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : సోషల్ మీడియాలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చనిపోయారని దుష్ప్రచారం చేస్తున్నారు. దుష్ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకురాలు చింతల గీతారెడ్డిపై చర్యలు తీసుకోవాలని గురువారం హుస్నాబాద్ పోలీస్‌స్టేషన్‌లో కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసినవారిలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మెన్ బొలిశెట్టి శివయ్య, నాయకులు బంక చందు, చిత్తారి రవీందర్, రాజిరెడ్డి, చిత్తారి పద్మ, వీరన్న గంపల శ్రీనివాస్ తదితరులుఉన్నారు.

కాబోయే భర్త ఆత్మహత్య చేసుకున్నాడని యువతి బలవన్మరణం

రామచంద్రాపురం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : కాబోయే భర్త ఆత్మహత్య చేసుకున్నాడన్న మనస్తాపంతో కాబోయే భార్య ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన సంగారెడ్డి జిల్లా కొల్లూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. ఎస్సై రమేష్ వివరాల ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం గుల్బర్గాకు చెందిన షేక్ హబీబ్, షబేబా బేగంలు కుటుంబంతో సహా నగరంలోని కాటేదాన్‌కు వలస వచ్చారు. ఇళ్లు లేని వీరు ఇంటి కోసం దరఖాస్తు చేసుకోవడంతో కొల్లూరు డబుల్ బెడ్ రూంలో ఇళ్లు వచ్చింది. ఈ మధ్యకాలంలో కొల్లూరు ఇంట్లోకి మకాం మార్చారు. ఆరునెలల క్రితం గుల్బర్గాకు చెందిన మహబూబ్‌తో ఆసియా ఫర్వీన్(19)కు నిశ్చితార్థం జరిగింది. 15 రోజుల క్రితం మహబూబ్ ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో ఆసియా ఫర్వీన్ కాటదాన్‌లోని కళాశాలకు వెళ్లకుండా ఇంట్లో దిగాలుగా కూర్చొంటోంది. బుధవారం తల్లి పక్కింటికి, తండ్రి నమాజ్‌కు వెళ్లారు. ఇదే సమయంలో ఆసియా ఫర్వీన్ బెడ్‌రూంలోకి వెళ్లి ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై రమేష్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మానవ అక్రమ రవాణా నిర్మూలన అందరి బాధ్యత

సిద్దిపేట కల్చరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ మండలి సంస్థ, ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో మానవ అక్రమ రవాణా నిర్మూలన అనే అంశంపై జిల్లాలోని వివిధ పాఠశాలలకు సంబంధించిన స్కూల్ అసిస్టెంట్ అధ్యాపకులకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. రెండు రోజుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా గురువారం సిద్దిపేట ప్రభుత్వ బాలికల పాఠశాలలో కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో మానవ అక్రమ రవాణ, లైంగిక వ్యాపారం ఎలా జరుగుతుంది, బాధితురాలి పైన ఉండే ప్రభావాలు, సైబర్ ఆధారిత అక్రమ రవాణా, చట్టాలు బీఎన్ఎస్, ఐటీపీఏ, పోక్సో, పీసీఎంఏ చట్టాలు, సఖీ, భరోసా, చైల్డ్‌లైన్, పోలీస్ టోల్ ఫ్రీ నెంబర్స్ 1098, 100, 181, 1930, 181 గురించి వివరించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ క్వాలిటీ కోఆర్డినేటర్ ముంద్రాతి రమేష్ మాట్లాడుతూ.. మనుషుల అక్రమ రవాణా నిర్మూలనలో ప్రజలు అందరు భాగస్వామ్యం అయినప్పుడే దీనిని సమూలంగా నివారించవచ్చు అని అన్నారు. మానవ అక్రమ రవాణా అనేది ప్రపంచ వ్యాప్తంగా అత్యంత వేగంగా విస్తరిస్తూ ఎంతో మంది అమ్మాయిల జీవితాలను నాశనం చేస్తున్న నేరపూరితమైన చర్య అని ఆందోళన వ్యక్తం చేశారు.


శిక్షణకు హాజరైన స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు

విద్యార్థులకు అవగాహన కల్పించాలి

పేద, మధ్య తరగతి అమ్మాయిలు, మహిళలు ఎక్కువగా అక్రమ రవాణా బారినపడుతున్నారన్నారు. ముఖ్యంగా పాఠశాలలో పేరెంట్స్ మీటింగ్స్‌లో అవగాహనా కల్పించాలని చెప్పారు.

సమాజంలో ఉన్న చాలా సమస్యలకు ఆర్థిక కారణాలతోపాటు, సామజిక కారణాలు దోహదం చేస్తాయని, అలాంటి వాళ్లను ట్రాఫికెర్స్ టార్గెట్ చేసి, మాయమాటలు, ఉద్యోగం, సినిమా అవకాశం అంటూ పట్టణాలకు తీసుకెళ్లి వ్యభిచార గృహాలలో అమ్ముతున్నారన్నారు. జిల్లా నుంచి గ్రామ స్థాయి వరకు అందరు అవగాహనా కలిగి ఉండి, అప్రమత్తం చేయడం ద్వారా దీన్ని నిర్మూలించవచ్చు అన్నారు. ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ అసిస్టెంట్ కోఆర్డినేటర్ మిథాలీ రాజ్ మాట్లాడుతూ.. మానవ అక్రమ రవాణాను ఆదిలోనే అడ్డుకుంటే మన ఆడపిల్లలను రక్షించుకోవచ్చన్నారు. ప్రతి రోజు ఎంతో మంది అమ్మాయిలు, మహిళలు దీని బారిన పడుతున్నారన్నారు. ముఖ్యంగా యువత, పిల్లలు ఆకర్షణలకు లోనై పట్టణాలకు వచ్చి వ్యభిచార గృహాలలో మగ్గుతున్నారన్నారు. ప్రజ్వల సంస్థ ద్వారా ఇప్పటి వరకు 30, 500 వేల మంది అమ్మాయిలను మహిళలను కాపాడినట్లు చెప్పారు. అనవసరమైన ఆప్స్ ద్వారా పర్సనల్ ఫొటోస్ వీడియోస్ పంపడం వల్ల ట్రాఫికింగ్‌కి గురవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మనోహర్, స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పోలీసులు ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండాలి

మెదక్ ఎస్పీ శ్రీనివాసరావు


పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన మెదక్ ఎస్పీ శ్రీనివాసరావు

చేగుంట ,అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పోలీసులు ప్రజలతో సత్సంబంధాలు కలిగి నేరాలను పెండింగ్‌లో లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించే దిశగా కృషి చేయాలని సిబ్బందికి మెదక్ ఎస్పీ శ్రీనివాసరావు సూచించారు. నార్సింగి పోలీస్ స్టేషన్‌ను గురువారం సందర్శించి పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం నార్సింగి శివారులోని ఫైర్ రేంజ్‌ను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులతో మర్యాదగా వ్యవహరించి వారికి న్యాయం జరిగే విధంగా సిబ్బంది చూడాలన్నారు. పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కారంకు కృషి చేయాలి అన్నారు. ప్రజల్లో నమ్మకం పెంచే విధంగా పోలీసులు శాఖ తరఫున గ్రామాల్లో మూఢనమ్మకాలు, సైబర్ నేరాలు, బాల్యవివాహాలు, ఆన్లైన్ మోసాలపై ప్రజలకు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండే విధంగా వివిధ కార్యక్రమాలు చేపట్టాలని ఆయన సూచించారు. సివిల్ కోర్టు కేసుల్లో భూ వివాదాల్లో పోలీసులు అత్యుత్సాహాన్ని ప్రదర్శించవద్దన్నారు. అనంతరం పోలీస్ స్టేషన్లో క్రైమ్ రికార్డులను పరిశీలించారు.

పీఆర్‌సీని తక్షణమే అమలు చేయాలి : టీపీటీఎఫ్

మర్కుక్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పీఆర్‌సీని అమలు చేసి ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రాజయ్య అన్నారు. గురువారం జగదేవ్‌పూర్ మండలంలోని పలు పాఠశాలలను సందర్శించి సమస్యల సేకరణ, సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జగదేవ్‌పూర్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సత్తయ్య, పోచయ్య, గజ్వేల్ జోన్ కన్వీనర్ శ్రీనివాస్, జిల్లా కౌన్సిలర్ శంకర్, జలంధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సభ్యత్వ నమోదు చేయిస్తున్న టీపీటీ ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రాజయ్య

వేర్వేరు చోట్ల ముగ్గురి ఆత్మహత్య

● మంజీరలో దూకి యువకుడి..


జగన్ (ఫైల్)

సంగారెడ్డి క్రైం/నారాయణఖేడ్//జోగిపేట రూరల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): వేర్వేరు కారణాలతో వేర్వేరు చోట్ల ముగ్గురు ఆత్మహత్యకు పాల్పడ్డారు. వ్యక్తిగత కారణాలతో ఓయువకుడు మంజీరా నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని చింతకుంట శివారులో గురువారం చోటుచేసుకున్నది. గ్రామస్తుల కథనం ప్రకారం.. మండలంలోని రోళ్లపహాడ్‌కు చెందిన జగన్ (17) అనే యువకుడు వ్యక్తిగత కారణాలతో గురువారం మధ్యాహ్నం చింతకుంట గ్రామ శివారులోని మంజీర నదిలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

కుటుంబ కలహాలతో ఒకరు..


ఆత్మహత్యకు పాల్పడిన రాజశేఖర్

కుటుంబ కలహాల కారణంగా ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సంగారెడ్డి రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. ఎస్సై మధుసూదన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి మండలం సదాశివనగర్‌కు చెందిన మన్నె రాజశేఖర్ (39) కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుండేవాడు. అతడికి ఏడు సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. కానీ సంతానం కలుగలేదు. భార్యతో కొన్ని రోజులుగా గొడవలు జరిగేవి. తీవ్ర మనస్తాపానికి గురైన రాజశేఖర్‌రెడ్డి తన ఇంట్లో ఎవరూ లేని సమయంలో దూలానికి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై మధుసూదన్‌రెడ్డి తెలిపారు.

ఉద్యోగి ఆత్మహత్య


చాకలి సంగయ్య (ఫైల్)

మద్యం మత్తులో భార్యతో గొడవపడి పురపాలక హౌట్‌సోర్సింగ్ ఉద్యోగి ఒకరు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన నారాయణకేడ్‌లో గురువారం వెలుగు చూసింది. స్థానిక ఎస్సై రాసుల శ్రీశైలం కథనం ప్రకారం.. నారాయణఖేడ్ పట్టణానికి చెందిన చాకలి సంగయ్య (57) అనే వ్యక్తి నారాయణఖేడ్‌లోని పురపాలకలో హౌట్‌సోర్సింగ్ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. సంగయ్యకు మద్యం తాగే అలవాటు ఉండటంతో బుధవారం రాత్రి మద్యం తాగిన మైకంలో కుటుంబికులతో, భార్యతో గొడవపడ్డాడు. గొడవ ఎందుకు చేస్తున్నావని భార్య ప్రశ్నించడంతో క్షణికావేశానికి గురయిన సంగయ్య పట్టణంలోని ఆక్సీజన్‌పార్కు వద్దకు వెళ్లి అక్కడ ఓ చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య చాకలి అంజమ్మ ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మానసిక స్థితి బాగోలేక వ్యక్తి ఆత్మహత్యాయత్నం

● కాపాడిన పోలీసులు

నర్సాపూర్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ పట్టణంలోని సునీతాలక్ష్మారెడ్డి కాలనీలో నివాసముండే సతీష్ అనే వ్యక్తి మానసిక స్థితి బాగా లేకపోవడంతో గురువారం కత్తితో మెడను కోసుకుని ఆత్మహత్యయత్నం చేసుకున్నాడు. ఈ విషయం స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారమివ్వడంతో అక్కడకు వెళ్లి ఆయనను వెంటనే నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స చేయించడంతో ప్రాణపాయం నుండి బయటపడ్డాడు.

రైలు ఢీకొని యువకుడి మృతి

మాసాయిపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన మాసాయిపేటలోని శ్రీనివాస నగర్ రైల్వే స్టేషన్ సమీపంలో భైనూర్ చెరువు వద్ద గురువారం సాయంత్రం రైలు ఢీకొని మృతి చెందాడు. కామారెడ్డి రైల్వే పోలీసు హెడ్ కానిస్టేబుల్ హనుమాన్‌లు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీనివాస నగర్ రైల్వే స్టేషన్ సమీపంలో నిజామాబాద్ వైపు వెళ్తున్న ప్యాసింజర్ రైలు గుర్తు తెలియని యువకుడు పట్టాలు దాటుతుండగా వేగంగా రైలు ఢీకొనడంతో యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు కామరెడ్డి పోలీసులు తెలిపారు

చెరువులో పడి వ్యక్తి..

టేక్మాల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన టేక్మాల్ మండలం పల్వంచ గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన నాయికోటి కృష్ణ (32) వ్యవసాయంతో పాటు కూలి పనులు చేసుకుంటూ చేపలు పడుతుంటాడు. గురువారం చెరువు వద్దకు వెళ్లిన అతడు ప్రమాదవశాత్తు చెరువులో పడి గల్లంతయ్యాడు. దీంతో అతడి కోసం నాలుగు గంటల పాటు గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టగా సాయంత్రం అతడి మృతదేహం లభ్యమైనట్లు గ్రామస్తులు చెప్పారు. స్థానిక పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. అతడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

బైక్ పైనుంచి జారి పడి మహిళ మృతి


పుష్పలత (ఫైల్)

వట్‌పల్లి, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు బైక్ పైనుంచి జారిపడి మహిళ మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని నాగులపల్లి శివారులో చోటుచేసుకుంది. ఎస్సై లవకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. రైకోడ్ మండలం ఎనికేపల్లి గ్రామానికి చెందిన పడకంటి పుష్పలత(32)భర్త శివకుమార్ కుమార్తె శ్రీవల్లితో కలిసి బైక్ పై ఆందోలు గురుకుల పాఠశాలకు వెళున్నారు. మార్గమధ్యంలో నాగులపల్లి శివారులో పుష్పలత బైక్‌పై నుంచి కింద జారి పడింది. దీంతో తీవ్ర గాయాలైన ఆమెను 108 వాహనంలో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. భర్త శివకుమార్ ఫిర్యాదు మెరుపు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు

ఉపాధ్యాయుడిని బెదిరించి డబ్బు వసూల్

నర్సాపూర్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఆటోలో ప్రయాణిస్తున్న ఉపాధ్యాయుడిని కత్తితో బెదిరించి తన వద్ద ఉన్న డబ్బులు తీసుకుని ఉడాయించిన వైనం గురువారం సాయంత్రం నర్సాపూర్‌లో చోటు చేసుకుంది. ఎస్సై రంజిత్‌కుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గుమ్మడిదల మండలం అన్నారంకు చెందిన కిష్టయ్య అనే ఉపాధ్యాయుడు నర్సాపూర్ మండలంలోని మంతూరులో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. గురువారం ఉదయం తహసీల్దార్ కార్యాలయంలో పని ఉండగా అక్కడకు వెళ్లి సాయంత్రం తిరిగి వెళ్లడానికి కొల్చారంలో ఆటో ఎక్కాడు. ఆటో నర్సాపూర్ ప్రధాన చౌరస్తా వరకు వచ్చాక అన్నారం వైపు వెళ్లాల్సి ఉండగా డ్రైవర్ ఆటోను తూప్రాన్ వైపు మళ్లించి నర్సాపూర్ పట్టణ సమీపంలోని గ్యాస్ గోదాం సమీపంలో ఉన్న ఓ కుంటలోనికి ఆటోను తీసుకెళ్లాడు. ఉపాధ్యాయుడిని కత్తితో బెదిరించి అతడిపై దాడి చేసి ఫోన్‌తో పాటు పర్సు తీసుకుని అక్కడే వదిలేసి వెళ్లాడు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యప్తు చేస్తున్నట్లు తెలిపారు. అయితే పర్సులో 12వందల రూపాయలతో పాటు పలు కార్డులున్నాయని తెలిపారు.

అనుమానాస్పద వ్యక్తుల బైండోవర్


లద్నూరులో అనుమానాస్పదంగా సంచరిస్తున్నవారిని విచారిస్తున్న ఎస్సై

మద్దూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : మద్దూరు మండలం లద్నూరులో పాత ఇనుప సామాను కొంటామని అనుమానాస్పందంగా సంచరిస్తున్న ఇద్దరి వ్యక్తులను అదుపులోకి తీసుకుని తహసీల్దారు ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై షేక్ మహబూబ్ అలీ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు లద్నూరు గ్రామంలో గురువారం పాత ఇనుప సామాను కొంటామని ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తున్నట్లు గ్రామస్తులు 100కి కాల్ చేశారు. సమాచారం రావడంతో సిబ్బందితో వెళ్లి అదుపులోకి తీసుకుగా జనగామ జిల్లా తరిగొప్పుల మండల కేంద్రానికి చెందిన పడతం ఆనందం, పడుతం శ్రీనివాస్ బుడిగ జంగాలు అని తెలిపారు. వీరిని తహసీల్దారు ఎదుట బైండోవర్ చేసినట్లు తెలిపారు.

మేఘనకు కన్నీటి వీడ్కోలు

కన్నీటి పర్యంతమైన విద్యార్థులు ఉపాధ్యాయులు

కుకునూరుపల్లి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): వారం క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో చికిత్స పొందుతూ మేఘన అనే విద్యార్థి బుధవారం రాత్రి మృతి చెందింది. కుకునూరుపల్లి బీఆర్ఎస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు మల్లం ఐలయ్య కుమార్తె అయిన మేఘన గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నది. గతవారం పాఠశాలకి వెళ్లే గ్రామంలో బైక్ ఢీకొని తీవ్ర గాయాలతో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందింది. ఉదయం తోటి విద్యార్థులు ర్యాలీ నిర్వహించి అనంతరం అంతిమయాత్రలో పాల్గొని కన్నీటి పర్యంతమయ్యారు. గజ్వేల్ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి ప్రతాప్ రెడ్డి కుటుంబ సభ్యులను ఓదార్చారు. పాఠశాల వద్ద స్పీడ్ బ్రేకర్లు నిర్మించాలని లేదా ప్రమాదాలు జరగకుండా ఇతర చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.


ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామస్తులు

వేలూరు ఆత్మహత్యల గోస పుస్తకావిష్కరణ



పులి రాజు రచించిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ వీరేందర్

గజ్వేల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఏటిగడ్డ కిష్టాపూర్ వాసి, ప్రభుత్వ ఉపాధ్యాయుడు, రైతునేస్తం అవార్డు గ్రహీత పులిరాజు రచించిన వేలూరు ఆత్మహత్యల గోస పుస్తకాన్ని ప్రముఖ సైకాలజిస్టు డాక్టర్ వీరేందర్ ఆవిష్కరించారు. గురువారం గజ్వేల్ పరిధిలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కార్గిల్ యుద్ధ వ్యూహకర్త డాక్టర్ జీజే రావు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ పెద్ది రాజు, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, టీపీటీఎఫ్ మాజీ అధ్యక్షుడు రాంచంద్రం, ఉపాధ్యాయ సంఘాల నాయకులు మల్లికార్జున్, బీజేపీ నాయకులు మనోహర్‌యాదవ్, సందీప్, నరసింహ, శివకుమార్, వెంకట్‌రెడ్డి, యాదమల్లు, ప్రవీణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు నర్సాపూర్ గురుకుల విద్యార్థిని

కౌడిపల్లి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : అండర్-14 రాష్ట్రస్థాయి యోగా పోటీలకు కౌడిపల్లి మండల పరిధిలోని సదాశివపల్లి గ్రామానికి చెందిన చెప్యాల వందన ఎంపికైంది. ఈ నెల 26న సంగారెడ్డి జిల్లాలోని శంకర్‌పల్లిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ఆమె పాల్గొననున్నదని నర్సాపూర్‌లోని శ్రీవత్సల్ గురుకుల పాఠశాల చైర్మన్ సతీష్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో ఈ విషయాన్ని తెలిపారు. స్వామి వివేకానంద స్కూల్ ఆఫ్ యోగా రంగారెడ్డి జిల్లా అసోసియేషన్, తెలంగాణ రంగారెడ్డి జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ సంయుక్తంగా హైదరాబాద్‌లో ఆగస్టులో యోగా పోటీలను నిర్వహించాయని, శ్రీవత్సల్ గురుకుల పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న చెప్యాల వందన ఈ పోటీల్లో గెలుపొంది సిల్వర్ మెడల్‌ను దక్కించుకుందని పేర్కొన్నారు. వందనను ప్రిన్సిపాల్ బాలజ్యోతితో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

'ఖేలో ఉత్సవ్' చెస్ రాష్ట్రస్థాయి పోటీల్లో సంయుక్త స్కూల్ విద్యార్థికి ద్వితీయ స్థానం



చెస్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన ఈశాన్

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : కొండాపూర్ మండల పరిధిలోని సంయుక్త ఇంటర్నేషనల్ స్కూల్‌కు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థి కె.ఈశాన్ చెస్ పోటీల్లో ప్రతిభ కనబరిచాడు. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో గురువారం జరిగిన రాష్ట్రస్థాయి ఖేలో ఉత్సవ్ ఛాంపియన్‌షిప్ - 2025లో అతను ద్వితీయ స్థానంలో నిలిచాడు. చెస్‌లో ప్రతిభ చూపిన విద్యార్థి ఈశాన్‌ను పాఠశాల యాజమాన్యం, తల్లిదండ్రులు అభినందించారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు జగదేవ్‌పూర్ ఆదర్శ పాఠశాల విద్యార్థినులు ఎంపిక

వాలీబాల్‌లోనూ మెరిసిన బాలికలు



విద్యార్థినులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

జగదేవ్‌పూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు జగదేవ్‌పూర్ ఆదర్శ పాఠశాల విద్యార్థినులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ స్లీవరాజ్ తెలిపారు. ఈ నెల 13న సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులోని మైత్రి క్రికెట్ క్లబ్ మైదానంలో జరిగిన ఉమ్మడి మెదక్ జిల్లా కబడ్డీ పోటీల్లో సిద్దిపేట జిల్లా తరఫున పాల్గొన్న జగదేవ్‌పూర్ ఆదర్శ పాఠశాల 8వ తరగతి విద్యార్థినులు ఆర్.చందన, ఎం.డి.జినత్ ప్రతిభ కనబరిచి, రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయిలోనూ మంచి ప్రదర్శన చూపించి జాతీయస్థాయికి ఎంపికయ్యే విధంగా వారికి శిక్షణ ఇవ్వాలని పీడీ అనంతరాములు చారికి ప్రిన్సిపాల్ సూచించారు. ఈ నెల 14న ప్రజ్ఞాపూర్ బాయ్స్ హైస్కూల్‌లో నిర్వహించిన అండర్-14 బాలికల వాలీబాల్ ఉమ్మడి మెదక్ జిల్లా పోటీల్లో సిద్దిపేట జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ క్రీడలలో జగదేవ్‌పూర్ ఆదర్శ పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థినులు ఎ.అనూష, ఆర్.సిరి పాల్గొని పతకాలను అందుకున్నారు. విద్యార్థినులను, పీడీ అనంతరాములు చారిని ప్రిన్సిపాల్, ఉపాధ్యాయుల బృందం వారిని అభినందించింది.

సైలెన్సర్ల మోత.. రోలర్‌తో వాత

గతేడాది జూలైలో సౌండ్ పొల్యూషన్‌కు కారణమైన దాదాపు 72 బైక్‌లను పోలీసులు సీజ్ చేశారు. వాటి సైలెన్సర్లను తొలగించి, సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట రోడ్డు రోలర్‌తో తొక్కించి ధ్వంసం చేశారు. నిబంధనలు అతిక్రమించి వాహనాలు నడిపినా, ప్రజలకు ఇబ్బందులు కలిగించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. అయినా సంగారెడ్డి జిల్లాలో కొందరు ఆకతాయి యువకుల ఆగడాలకు అంతులేకుండా పోయింది. లక్షల రూపాయల విలువైన బైక్‌లు కొనుగోలు చేసి వాటి సైలెన్సర్లను మార్పిడి చేస్తూ, అతివేగంతో నడుపుతూ కర్ణ కఠోరమైన శబ్దంతో తీవ్ర శబ్ద కాలుష్యానికి కారణమవుతున్నారు. రంగంలోకి దిగిన పోలీసులు ఇన్నాళ్లకు మళ్లీ తమ కొరడా ఝుళిపించారు.



సంగారెడ్డి పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద రోడ్డు రోలర్‌తో బైక్ సైలెన్సర్లను ధ్వంసం చేయిస్తున్న పోలీసులు

బైక్ సైలెన్సర్ల మార్పిడితో శబ్ద కాలుష్యం

ఆకతాయి యువత ఆగడాలు

కొరడా ఝుళిపించిన పోలీసులు... సైలెన్సర్ల ధ్వంసం

మూన్నాళ్ల ముచ్చటగానే ఈ చర్యలు

మళ్లీ యథావిధిగా మోత మోగిస్తే ఎలా?

సంగారెడ్డి క్రైం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి పట్టణంలోని పాతబస్టాండ్ నుంచి పోతిరెడ్డిపల్లి వరకు సాధారణ రోజుల్లో ఉదయం నుంచి రాత్రి వరకు విపరీతమైన రద్దీ ఉంటుంది. ముఖ్యంగా సాయంత్రం వేళల్లో పాఠశాలలు, కాలేజీలు వదలడంతో విద్యార్థులు, ఉద్యోగులు తమ ఇళ్లకు వెళ్తుంటారు. ఈ సమయంలో కొందరు యువకులు సైలెన్సర్లు మార్చిన మోటార్ వాహనాలపై అతివేగంగా వెళ్తూ పక్కన వెళ్తున్న వారికి తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నారు. దాదాపు అర కిలోమీటరు దూరం వరకు ఆ శబ్దం వినిపిస్తూనే ఉంటుంది. కర్ణ కఠోరంగా వినిపించే ఈ శబ్దం కారణంగా పక్కన వెళ్తున్న వాహనచోదకులు ఒక్కసారిగా భయభ్రాంతులకు గురవుతున్నారు. ఈ ఆకతాయిలను పట్టుకునే లోపే బైక్‌లపై అతివేగంగా దూసుకుపోతున్నారు. ముఖ్యంగా రాత్రి పది గంటల తర్వాత ఇలాంటి వాహనాలను నడుపుతూ రోడ్లపై యమ స్పీడ్‌గా వెళ్తున్నారు. పెద్ద శబ్దంతో బైక్‌పై వెళ్లడం నేటి యువతకు ఫ్యాషన్‌గా మారి శబ్ద కాలుష్యానికి కారకులవుతున్నారు.

ట్రాఫిక్ పోలీసుల ముందు నుంచే...

విధుల్లో ఉన్న ట్రాఫిక్ పోలీసులు సౌండ్ మోతతో ట్రాఫిక్ సిగ్నళ్లను దాటిపోతున్న బైకర్లను నియంత్రించడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లా ఎస్పీ కార్యాలయం, ఆర్‌అండ్‌బీ భవనం, పోతిరెడ్డిపల్లి చౌరస్తాలతో పాటు ప్రధాన కూడళ్లలో విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసుల కళ్ల ముందు నుంచే ఈ ఆగడాలు సాగుతున్నా పట్టనట్టు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో పోలీసులు ఆకతాయి యువకుల ఆటకట్టించేందుకు సిద్ధమయ్యారు. సంగారెడ్డి, పటాన్‌చెరులో బైక్‌లకు సైలెన్సర్లు మార్పిడి చేసి, అధిక శబ్దం చేస్తున్న వాహనాలపై గురువారం చర్యలకు ఉపక్రమించారు. రోడ్డు రోలర్‌తో సైలెన్సర్లను ధ్వంసం చేయించారు.

కేసుల నమోదుతోనే చెక్

పెద్ద శబ్దంతో బైక్‌పై రయ్ రయ్ మంటూ వెళ్లడం నేటి యువతకు ఫ్యాషన్‌గా మారిపోయింది. ఈ కారణంగా బైక్ సైలెన్సర్లను మార్పించి శబ్ద కాలుష్యానికి కారకులవుతున్నారు. మోటార్ బైక్‌లకు సైలెన్సర్లను మార్పిడి చేసే మెకానిక్‌లపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని గతంలో పోలీసులు హెచ్చరించారు. కానీ ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో బైక్ ఆకతాయిల ఆగడాలకు అంతులేకుండా పోతోంది. స్పెషల్ డ్రైవ్ ద్వారా అధిక శబ్దం చేసే బైక్ సైలెన్సలర్లను గుర్తించి, వాటిని ధ్వంసం చేయించినప్పటికీ ఇది మూన్నాళ్ల ముచ్చటగానే మారుతుంది. పది రోజులు, లేదా నెల వరకు ఎలాంటి మార్పిడులు చేయకుండా ఉంటారేమో, మళ్లీ ఆకతాయి యువకులు యథావిధిగా మోత మోగిస్తూనే ఉంటారు. కేసుల నమోదుతోనే ఈ సమస్యకు చెక్ పెట్టే అవకాశం ఉన్నది.

పోలీసుల ఉక్కుపాదం

● సంగారెడ్డి, పటాన్‌చెరులో 260 సైలెన్సర్ల ధ్వంసం

సంగారెడ్డి క్రైం/పటాన్‌చెరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : మూడు రోజులుగా సంగారెడ్డిలో డీఎస్పీ సత్తయ్యగౌడ్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించి అధిక శబ్దం వచ్చే బైక్ సైలెన్సర్లను తొలగించారు. గురువారం సంగారెడ్డి పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద 106 బైక్ సైలెన్సర్లను రోడ్డు రోలర్‌తో ధ్వంసం చేశారు. పటాన్‌చెరు నియోజకవర్గ వ్యాప్తంగా కూడా నాలుగు రోజులుగా పోలీసులు తనిఖీలు నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా అమర్చుకున్న 154 మోటారు సైకిళ్ల సైలెన్సర్లను స్వాధీనం చేసుకుని, రోలర్‌తో ధ్వంసం చేయించారు. ఈ సందర్భంగా డీఎస్పీ సత్తయ్యగౌడ్ మాట్లాడుతూ, అధిక శబ్దం వచ్చే సైలెన్సర్లు పెట్టుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



పటాన్‌చెరులో బైక్ సైలెన్సర్‌లను ధ్వంసం చేయిస్తున్న పోలీసులు

సైలెన్సర్లు మార్పిడి చేస్తే కఠిన చర్యలు



సంగారెడ్డి పట్టణంలో కొందరు యువకులు తమ బైక్‌లకు సైలెన్సర్లు మార్పిడి చేసి అధిక శబ్దం వచ్చే విధంగా చేస్తున్నారు. దీన్ని అరికట్టేందుకు వాహనాల తనిఖీలు ముమ్మరం చేశాం. అధిక శబ్దం వచ్చే బైక్‌ల సైలెన్సర్లు తొలగిస్తాం. ఎవరైనా సైలెన్సర్లు మార్పిడి చేస్తే కేసులు నమోదు చేస్తాం. అలాగే సైలెన్సర్లు మార్పిడి చేసే మెకానిక్‌లపై చర్యలు తీసుకుంటాం.

- రామకృష్ణారెడ్డి, ట్రాఫిక్ సీఐ, సంగారెడ్డి

80 డెసిబెల్స్ దాటితే ప్రమాదమే



సాధారణంగా చెవులకు ప్రమాదం లేకుండా వినదగే శబ్దం స్థాయి 60 డెసిబెల్స్ వరకు సురక్షితంగా వుంటుంది. శబ్దం స్థాయి 80 డెసిబెల్స్ దాటితే చెవులకు తీవ్ర ప్రభావం ఉంటుంది. సాధారణ సంభాషణ, బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ 60 డెసిబెల్స్ లోపు ఉంటుంది. ఈ శబ్దం దీర్ఘకాలం విన్నా ఎలాంటి నష్టం ఉండదు. మోటార్ సైకిల్, హెవీ మిషన్ల శబ్దం 85 డెసిబెల్స్ స్థాయి వరకు ఉంటుంది. టపాసులు పేల్చడం ద్వారా వచ్చే శబ్దం 100 డెసిబెల్స్ ఉంటుంది. మోటార్ బైక్ సైలెన్సర్ మార్పిడి ద్వారా వచ్చే శబ్దం స్థాయి దాదాపు 120 డెసిబెల్స్ వరకు ఉంటుంది. ఇలాంటి శబ్దాలు ఎక్కువ సేపు వింటే చెవులు వినికిడిని శాశ్వతంగా కోల్పోయే ప్రమాదం ఉంది.

- కె.పరమేశ్వర్, ఈఎన్‌టీ వైద్యుడు, సంగారెడ్డి




క్రీడా జ్యోతిని వెలిగిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య, ఎస్పీ పంకజ్, ఎంపీ రఘునందన్, ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి తదితరులు, లంబాడీ నృత్యం చేస్తున్న విద్యార్థినులు

అట్టహాసంగా రాష్ట్రస్థాయి క్రీడాపోటీలు

క్రీడా జ్యోతి వెలిగించి ప్రారంభించిన ప్రజాప్రతినిధులు, కలెక్టర్

పటాన్‌చెరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : పటాన్‌చెరులోని మైత్రి మైదానంలో గురువారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో 69వ రాష్ట్రస్థాయి వాలీబాల్, కబడ్డీ పోటీలకు శ్రీకారం చుట్టారు. ఎంపీ రఘునందన్‌రావు, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య, ఎస్పీ పరితోష్ పంకజ్ పోటీలను ప్రారంభించారు. 33 జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు మార్చ్ పాస్ట్‌ను నిర్వహించారు. విద్యార్థులు తీసుకువచ్చిన కాగడాతో క్రీడాజ్యోతిని వెలిగించి, వాలీబాల్, కబడ్డీ పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. అంతర్జాతీయంగా దేశ క్రీడాకారుల సంఖ్య తగ్గుతోందని ఆందోళన వ్యక్తంచేశారు. విద్యార్థులు చదువుతో పాటు ఆటలకు సమయాన్ని కేటాయించాలని సూచించారు. క్రీడల్లో రాణిస్తున్న వారికి ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రత్యేక కోటాను అమలు చేస్తోందని తెలిపారు. ఎంపీ రఘునందన్‌రావు మాట్లాడుతూ 150 కోట్ల మంది ఉన్న దేశంలో క్రీడాకారుల ప్రాతినిధ్యం స్వల్పంగా ఉందన్నారు. ఒలింపిక్ క్రీడల్లో దేశ విజయాల సంఖ్య పెరగాలంటే విద్యార్థి దశ నుంచే క్రీడలకు ప్రాధాన్యత పెరగాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గాన్ని క్రీడలకు నిలయంగా మారుస్తున్నామని తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని మండల కేంద్రాల్లో మైదానాల కేటాయింపు ప్రక్రియ పూర్తయిందని చెప్పారు.

ఎన్నాళ్లకెన్నాళ్లకు?

- నర్సాపూర్ కోమటికుంట సుందరీకరణకు నిధుల కేటాయింపు
- మున్సిపల్ శాఖ ద్వారా రూ.1.20 కోట్లు మంజూరు
- మురుగు, చెత్తతో డంపుయార్డును తలపిస్తున్న కుంట
- పాలకవర్గం లేదు.. అధికారులు పనులు చేసేనా?... స్థానికుల ఆశలు నెరవేరేనా?



నర్సాపూర్ కోమటి కుంట కట్టపై ఇష్టానుసారంగా పడేసిన వ్యర్థాలు

నర్సాపూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : రోజురోజుకు విస్తరిస్తూ వేగంగా అభివృద్ధి చెందుతున్న నర్సాపూర్ పట్టణానికి ఆనుకుని ఉన్న కోమటికుంట గతంలో స్వచ్ఛమైన నీటితో కళకళలాడుతూ పొలాలకు నీరందించేది. అయితే పట్టణీకరణ పెరగడంతో, పెద్దఎత్తున నిర్మాణాలు జరగడంతో కుంట ఇళ్లకు అతి దగ్గరైంది. దీంతో ప్రస్తుతం ఈ కుంట మురుగునీరు, చెత్తచెదారంతో డంపుయార్డును తలపిస్తోంది. పట్టణానికి అత్యంత సమీపంలో ఉన్న ఈ కుంటను సుందరీకరించి, ప్రజలకు ఆహ్లాదకర వాతావరణంలో సేద తీరడానికి, వాకింగ్ చేసుకోవడానికి అనువుగా తీర్చిదిద్దాలని స్థానికులు ఎన్నో ఏళ్లుగా కోరుతున్నారు. ఎట్టకేలకు సుందరీకరణకు నిధులు మంజూరయ్యాయి.

మురుగు, చెత్తతో అధ్వానం

గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే మదన్‌రెడ్డి సుందరీకరణకు నిధులు తెస్తానని హామీ ఇచ్చి, ప్రతిపాదనలు కూడా సిద్ధం చేయించినా ఆ ప్రయత్నం కార్యరూపం దాల్చలేదు. సుందరీకరణ పనులు ఆలస్యం కావడంతో కోమటికుంట కట్టపై స్థానికులు చెత్త వేయడం మొదలుపెట్టారు. దీంతో కోమటికుంట డంపుయార్డులా తయారైంది. అంతేకాక, సమీపంలోని ఇళ్ల నుంచి మురుగునీరు పెద్ద ఎత్తున వచ్చి కుంటలోకి చేరడంతో నీటి రంగు మారి కలుషితమైంది. గతంలో కలెక్టర్ పట్టణంలో పర్యటించినప్పుడు ఈ కుంటను సందర్శించి, నీటిలో పడేలా ఉన్న చెత్తను చూసి అసంతృప్తి వ్యక్తం చేశారు. వెంటనే చెత్తను తొలగించి, శుభ్రం చేయాలని అప్పటి మున్సిపల్ అధికారులకు ఆదేశాలు కూడా జారీ చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మున్సిపల్ అధికారులు కొంతకాలం చెత్తను తొలగించి, సమీపంలోని వారు చెత్త వేయకుండా చర్యలు తీసుకున్నారు. అయితే, తిరిగి పర్యవేక్షణ కొరవడటంతో సమీపంలోని వ్యాపారులు, ఇళ్లలోని వారు ఇష్టానుసారంగా చెత్తతో పాటు ప్లాస్టిక్ వ్యర్థాలను పెద్ద ఎత్తున వేస్తున్నారు. దీంతో వ్యర్థాలు నీటిలో కలిసి, నీరంతా పూర్తిగా కలుషితమవుతోంది. కలెక్టర్ సందర్శించిన సమయంలో చెత్త వేసేవారిని గుర్తించి జరిమానా విధించాలని సూచించినా, అటువంటి చర్యలు లేకపోవడంతో వ్యర్థాలు వేయడంతో పరిస్థితి దారుణంగా మారుతోంది.

సుందరీకరణకు నిధులు

ఎన్నో రోజులుగా కోమటికుంట సుందరీకరణ చేయాలని ఎదురుచూస్తున్న స్థానిక ప్రజల కల ఎట్టకేలకు నెరవేరనుంది. ప్రభుత్వం నుంచి ఇటీవల పట్టణ అభివృద్ధికి మున్సిపల్ శాఖ ద్వారా నిధులు మంజూరు కాగా, అందులో కోటి 20 లక్షల రూపాయలు కోమటికుంట సుందరీకరణకు కేటాయించారు. దీంతో వ్యర్థాలు, మురుగునీటితో దారుణంగా తయారైన కుంట రూపురేఖలు మారే అవకాశం ఉందని స్థానికుల్లో సంతోషం వ్యక్తమవుతోంది. అయితే, ప్రస్తుతం పాలకవర్గం లేకపోవడంతో పనులు ఎప్పటిలోగా ప్రారంభిస్తారనేది ప్రశ్నార్థకంగా మారింది. అధికారులు చొరవ తీసుకుని ఈ పనులను త్వరగా ప్రారంభించాల్సిన అవసరం ఉంది. ముందుగా కుంటలోకి వస్తున్న మురుగునీరు రాకుండా చేసి, వ్యర్థాలు వేయకుండా తగిన చర్యలు తీసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

పౌష్టికాహారంతో ఆరోగ్యం సమతుల్యం



పౌష్టికాహార ఉత్పత్తుల ప్రదర్శనను తిలకిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, కలెక్టర్ ప్రావీణ్య

పటాన్‌చెరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : పౌష్టికాహారంతో ఆరోగ్యం సమతుల్యంగా ఉంటుందని, గర్భిణులు తప్పనిసరిగా తీసుకోవాలని కలెక్టర్ ప్రావీణ్య సూచించారు. గురువారం పటాన్‌చెరు మున్నూరు కాపు భవనంలో అంగన్‌వాడీ పోషకాహార మాసోత్సవాలు నిర్వహించారు. 250 మంది గర్భిణులకు సామూహిక సీమంతాలు, 50 చిన్నారులకు అక్షరాభ్యాసం కార్యక్రమాలను ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, ఎంపీ రఘునందన్‌రావుతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గర్భిణులకు ప్రత్యేకంగా ఆహారాన్ని ప్రభుత్వం అందిస్తోందని చెప్పారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ రీజినల్ డైరెక్టర్ మోతి, జిల్లా అధికారి లలిత కుమారి, కార్పొరేటర్లు మెట్టుకుమార్‌యాదవ్, పుష్పానగేష్ తదితరులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి ఫొటోగ్రఫీ, షార్ట్‌ఫిల్మ్ పోటీలకు దరఖాస్తుల ఆహ్వానం

సంగారెడ్డి క్రైం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం, పోలీసు ఫ్లాగ్‌డేను పురస్కరించుకుని జిల్లాలోని ఔత్సాహిక ఫొటోగ్రాఫర్లకు, ఫొటోగ్రఫీ, షార్ట్‌ఫిల్మ్ పోటీలను నిర్వహించనున్నట్టు సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 21 నుంచి 31వరకు నిర్వహించే వారోత్సవాల్లో భాగంగా అత్యవసర సమయాల్లో పోలీసుల స్పందన, ప్రకృతి వైపరీత్యాల్లో పోలీసుల సేవ, ఇతర సందర్భాల్లో పోలీసుల కీర్తి ప్రతిష్టలను పెంపొందించే అంశాలకు సంబంధించి గత సంవత్సరం అక్టోబరు నుంచి ఈ ఏడాది అక్టోబరు వరకు తీసిన మూడు ఫొటోలు, తక్కువ నిడివి గల మూడు నిమిషాల గల షార్ట్‌ఫిల్మ్ లోడ్ చేసిన పెన్ డ్రైవ్‌ను రాష్ట్రస్థాయి పోటీల కోసం 22వ తేదీలోపు పంపించాలని జిల్లా పోలీసు కార్యాలయంలో పీఆర్వోకు అందజేయాలని ఆయన తెలిపారు. మరిన్ని వివరాలకు 8712539040కు సంప్రదించాలని కోరారు.

పాఠశాలలో సమస్యలు తిష్ఠ

- ప్రహరీ లేక విద్యార్థుల అవస్థలు
- పాఠశాలకు వెళ్లాలంటే అంతా బురదే
- అసంపూర్తిగా తాగునీటి ట్యాంకు


బురదమయంగా పాఠశాల ఆవరణ

ఝరాసంగం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో అన్నిరకాల వసతులు కల్పిస్తున్నామని చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో అది మాత్రం కనిపించడం లేదు. ఇందుకు సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలంలోని మాచునూరు ప్రాథమిక పాఠశాలే నిదర్శనం. ఈ పాఠశాలలో సమస్యలు తిష్ఠవేశాయి. పాఠశాలలో మొత్తం 50 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ముగ్గురు విద్యార్థులు విధులు నిర్వర్తిస్తున్నారు. పాఠశాల ముందుభాగం అంతా బురదమయంగా ఉండడంతో విద్యార్థులు అందులోంచి వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. పాఠశాల ముందు నుంచే గ్రామంలోకి వెళ్లేందుకు ప్రధాన రహదారి ఉండడంతో ప్రతిరోజు ట్రాక్టర్లు, పొలాలకు ఎడ్ల బండ్లు వెళ్తుండడంతో రోడ్డు దెబ్బతిని బురదమయంగా మారింది. ప్రజాప్రతినిధులు ఈ రోడ్డు గురించి పట్టించుకోవడం లేదని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వాపోయారు. తాగునీటి కోసం బోరు ద్వారా పైపులను ఏర్పాటు చేసిన కనెక్షన్ ఇవ్వకపోవడంతో ఇంటి నుంచి తాగునీరు తెచ్చుకోవాల్సిన దుస్థితి.


కూలిన పాఠశాల ప్రహరీ

ప్రహరీ కరువు

పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గ్రామానికి చెందిన కొంతమంది పశువులను సైతం పాఠశాల లోపలి గుండా తీసుకెళ్తున్నారు. దీని వల్ల పాఠశాల ఆవరణలో విద్యార్థులు ఆడుకోవాలంటే ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా పాఠశాల లోపలికి పందులు, కుక్కలు వచ్చి స్వైర విహారం చేస్తున్నాయి. ప్రహరీ లేకపోవడంతో రాత్రివేళల్లో పాఠశాల మందుబాబులకు అడ్డాగా మారుతోంది. అధికారులు స్పందించి పాఠశాలలోని సమస్యలు పరిష్కరించాలని ఉపాధ్యాయులు, గ్రామస్థులు కోరుతున్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండొద్దు

- నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి


పెద్దశంకరంపేటలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

పెద్దశంకరంపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని ఎమ్మెల్యే పి.సంజీవరెడ్డి ట్రాన్స్‌కో అధికారులను ఆదేశించారు. గురువారం పెద్దశంకరంపేటతో పాటు మండల పరిధిలోని మూసాపేట, లక్ష్మాపూర్ మాడ్వెట్‌పల్లి, దానంపల్లి, కోలపల్లి తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసిన నూతన ట్రాన్స్‌ఫార్మర్లను ప్రారంభించి మాట్లాడారు. గ్రామాల్లో ఎక్కడైనా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడితే వెంటనే విద్యుత్ అధికారులు స్పందించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకుడు నారాగౌడ్, ఆర్.ఎన్ సంతోష్‌కుమార్, మురళీపంతులు, రాజేందర్‌గౌడ్, సుభాష్‌గౌడ్, గంగారెడ్డి, కుంట్ల రాములు, రోమాల సాయిలు, ఆయా కాంగ్రెస్ గ్రామ నాయకులు, క్యాకర్తలు పాల్గొన్నారు.

భోజనం విషయంలో రాజీపడొద్దు : సబ్ కలెక్టర్


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న సబ్ కలెక్టర్ ఉమాహారతి

నారాయణఖేడ్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : వసతి గృహ, గురుకులాల విద్యార్థులకు రుచి, శుచి కలిగి భోజనాన్ని అందించాలని, భోజనం విషయంలో రాజీపడొద్దని నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమాహారతి అధికారులకు ఆదేశించారు. గురువారం నారాయణఖేడ్‌లోని సంక్షేమశాఖకు సంబంధించిన సమీకృత బాలుర వసతి గృహంతో పాటు ఎస్సీ సంక్షేమశాఖకు సంబంధించిన కళాశాల బాలుర వసతి గృహాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించి, వారితో కలిసి భోజనం చేశారు. వసతి గృహంలో నెలకొన్న సమస్యలను అధికారులు రవీందర్, శ్రీనివాస్‌ను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని, పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహించొద్దన్నారు.

పశువులకు టీకాలు వేయించాలి : వెంకటయ్య


శేరి గ్రామంలో పశువులకు వేస్తున్న గాలికుంటు టీకాలను పరిశీలిస్తున్న వెంకటయ్య

వెల్దుర్తి/మనోహరాబాద్/పాపన్నపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ రైతు తమ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్ప వేయించాలని జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి వెంకటయ్య అన్నారు. గురువారం మండల పరిధిలోని శేరి గ్రామంలో పశువులకు వేస్తున్న గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి రేఖర సజ్జ, వెటర్నరీ లైవ్‌స్టాక్ ఆఫీసర్ ఫజల్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు. అలాగే మనోహరాబాద్ మండలం పోతారం గ్రామంలో పశువులకు వేస్తున్న గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి వెంకటయ్య పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారి రామలక్ష్మి, లైవ్ స్టాక్ అసిస్టెంట్ రాజిరెడ్డి, గోపాలమిత్రలు పాల్గొన్నారు. పాపన్నపేటలో గాలికుంట నివారణ టీకాల కార్యక్రమాన్ని మండల పశు వైద్యాధికారి సౌమ్య ప్రారంభించారు.

సమాజ అభివృద్ధికి కృషిచేద్దాం

జహీరాబాద్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : సమాజ అభివృద్ధికి సంఘటితంగా కృషిచేద్దామని వీరశైవ లింగాయత్ సమాజ్ జిల్లా అధ్యక్షుడు నర్సింహులు పేర్కొన్నారు. గురువారం జహీరాబాద్ పట్టణంలోని బసవేశ్వర మండపంలో నియోజకవర్గ స్థాయి లింగాయత్ సమాజ్ నాయకుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. సమాజ్ నాయకులు సమాజం అభివృద్ధికి తనవంతు బాధ్యతగా కృషి చేయాలన్నారు. కాగా కోహీర్, ఝరాసంగం, మొగుడంపల్లి, మండలాల అధ్యక్షులుగా బిల్లపాటి విజయ్‌కుమార్, రాంశెట్టిని ఎన్నుకున్నారు.

'సర్వేయర్‌పై చర్యలు తీసుకుని న్యాయం చేయండి'

సంగారెడ్డి రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : తనపై దౌర్జన్యం చేస్తున్న మండల సర్వేయర్‌పై చర్యలు తీసుకుని, తనకు న్యాయం చేయాలని సంగారెడ్డి మండలం పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన మంగళి చెన్నయ్య కలెక్టర్ ప్రావీణ్యకు గురువారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని సర్వే నంబరు 49-1, 49,2లో తన పట్టా భూమిలో సర్వే నిర్వహించేందుకు నోటీసులు ఇచ్చారన్నారు. ఈ సర్వేను నిలిపివేయాలని భూ కొలతల అధికారి, సంగారెడ్డి మండల తహసీల్దార్‌కు విన్నవించి రాతపూర్వకంగా దరఖాస్తు చేసుకుని రసీదు పొందానని తెలిపారు. సర్వే నిమిత్తం వచ్చిన మండల సర్వేయర్‌కు రశీదు చూపించగా వెళ్లిన.. ఆయన తిరిగొచ్చి తమకు తెలియకుండా సర్వే చేస్తున్నారన్నారు. సర్వేను అడ్డుకోగా 'నా ఇష్టం వచ్చినట్టు సర్వే చేస్తాను, ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకో అంటూ' దౌర్జన్యం చేస్తున్నారని వాపోయాడు. తనకు న్యాయం చేసి ఆదుకోవాలని ఫిర్యాదులో కోరాడు.

పారదర్శక రెవెన్యూ పాలన లక్ష్యంగా పనిచేయాలి

- అదనపు కలెక్టర్ నగేష్


తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ నగేష్

చేగుంట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : పారదర్శక రెవెన్యూ పాలన లక్ష్యంగా పనిచేయాలని మెదక్ అదనపు కలెక్టర్ నగేష్ పేర్కొన్నారు. గురువారం చేగుంట తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించి, భూ రికార్డులను పరిశీలించి మాట్లాడారు. గ్రామపాలన అధికారుల పనితీరు, ముఖ్యంగా గ్రామాల్లోని సాదాబైనామా విచారణ పటిష్టంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. దరఖాస్తులు పెండింగ్‌లో లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శివప్రసాద్, ఆర్ఐ సంతోష్, సిబ్బంది పాల్గొన్నారు.

కాజీపల్లిలో అక్రమ కట్టడాల కూల్చివేత


అక్రమ కట్టడాలను కూల్చివేస్తున్న రెవెన్యూ అధికారులు

జిన్నారం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : జిన్నారం మండలం కాజీపల్లిలోని సర్వే నంబరు 181లో గల ప్రభుత్వ భూముల్లో నిర్మించిన అక్రమ కట్టడాలను రెవెన్యూ అధికారులు తహసీల్దార్ ఆదేశాల మేరకు గురువారం కూల్చేయించారు. సుమారు 6 కట్టడాలను అధికారులు నేలమట్టం చేశారు. సీఐ రవీందరరెడ్డి సిబ్బందితో కలిసి కూల్చివేతలకు బందోబస్తు కల్పించారు. కొంతకాలంగా ప్రభుత్వ భూముల్లో స్థానిక నాయకుల ఆధ్వర్యంలోనే అక్రమ కట్టడాలు జరుగుతున్నాయని స్థానికులు తెలిపారు.

పంట నమోదుపై నిర్లక్ష్యం చేయొద్దు

- మెదక్ జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్


నత్నాయపల్లిలో వరి పొలాలను పరిశీలిస్తున్న దేవకుమార్

నర్సాపూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : పంట నమోదు కార్యక్రమం పట్ల ఏ మాత్రం నిర్లక్ష్యం చేయకుండా త్వరగా పూర్తి చేయాలని మెదక్ జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్ సూచించారు. గురువారం నర్సాపూర్‌లోని రైతువేదికలో డివిజన్ పరిధిలోని వ్యవసాయ విస్తరణ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ కార్యకలాపాలపై క్షేత్రస్థాయి అధికారుల పురోగతిని సమీక్షించి పలు సూచనలు చేశారు. అనంతరం మండలంలోని నత్నాయపల్లి గ్రామాన్ని సందర్శించి అక్కడి వరి పొలాలను పరిశీలించారు. రైతులకు సుడిదోమ, అగ్గితెగులు, మెడ విరుపుకు పాటించాల్సిన సస్యరక్షణ చర్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ ఏడీఏ వినయ్‌కుమార్, నర్సాపూర్ ఏడీఏ సంధ్యారాణి, డివిజన్ పరిధిలోని మండల వ్యవసాయ అధికారులు, విస్తరణ అధికారులు పాల్గొన్నారు.



అనుమతులెలా..?

- సంగారెడ్డి ప్రధాన రహదారిపై టపాసుల విక్రయం

సంగారెడ్డి పట్టణంలోని ప్రధాన రహదారిపై చర్చిగేట్ వద్ద టపాసుల విక్రయాలు దర్జాగా కొనసాగిస్తున్నారు. టపాసుల దుకాణం కోసం అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని జిల్లా ఫైర్ అధికారులు పదే పదే చెబుతున్నా కొందరు వాటిని పాటించడం లేదు. ప్రధాన రహదారిపై దర్జాగా టపాసులు ఏర్పాటు చేసి విక్రయిస్తుండటం గమనార్హం.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి, సంగారెడ్డి

అనుమతులు లేని టపాసు దుకాణాలపై చర్యలు

- సంగారెడ్డి స్టేషన్ ఫైర్ ఆఫీసర్ శ్రీకాంత్‌రెడ్డి

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : దీపావళి సందర్భంగా ఏర్పాటు చేసే 'టపాసుల' దుకాణాలకు ఫైర్ సేఫ్టీతో ఇతర ప్రభుత్వ శాఖల అనుమతి తప్పనిసరి అని సంగారెడ్డి అగ్నిమాపకశాఖ అధికారి(స్టేషన్ ఫైర్ ఆఫీసర్ -ఎస్ఎఫ్ఓ) శ్రీకాంత్‌రెడ్డి స్పష్టం చేశారు. కొందరు అనుమతి లేకుండా టపాసుల దుకాణాలు పెడుతున్నట్టు తమ దృష్టికి వచ్చిందని వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమతి పొందిన టాపాసుల దుకాణాల యజమానులు తమ దుకాణాల వద్ద తప్పకుండా ఫైర్ సేఫ్టీ నియమ, నిబంధనలు పాటించాలని సూచించారు. లేకపోతే లైసెన్సులు రద్దుచేస్తామని హెచ్చరించారు. అధికారులు నిర్దేశించిన స్థలాల్లోనే టపాసుల దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. దుకాణాల వద్ద ఫైర్ ఎగ్జిగ్యూషర్(మంటలు ఆర్పే పరికరం) మిషన్లు అందుబాటులో ఉంచుకోవాలని నిర్వాహకులకు సూచించారు.

బాణసంచా దుకాణాలకు హద్దులు ఏర్పాటు

నారాయణఖేడ్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : దీపావళి సందర్భంగా బాణసంచా విక్రయాల కోసం నారాయణఖేడ్ తహసీల్దార్ కార్యాలయ ఆవరణలోని మైదానంలో గురువారం దుకాణాదారులకు కమిషనర్ జగ్జీవన్ లాటరీల ద్వారా స్థలాలను కేటాయించారు. తహసీల్దార్ కార్యాలయం ముందు నుంచి అటవీశాఖ కార్యాలయం ఎదుట వరకు, అక్కడి నుంచి నీటి పారుదల శాఖ కార్యాలయం ముందువరకు ఎల్ ఆకారంలో దుకాణా సముదాయాన్ని ఏర్పాటు చేశారు. అగ్నిమాపక కేంద్రం అధికారి శ్రీధర్ పర్యవేక్షణలో, అగ్నిమాపక, పురపాలక సిబ్బంది, దుకాణాల ఏర్పాటుకు మార్కింగ్ వేశారు.

న్యూస్ బాక్స్

సామాజిక సేవతోనే గుర్తింపు

పుల్‌కల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : సామాజిక సేవా కార్యక్రమాలతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని మాజీ ఎంపీపీ, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు భూంరెడ్డి సుభాష్‌రెడ్డి అన్నారు. చౌటకూర్ మండలం పోసానిపల్లి కేంద్ర ప్రాథమికోన్నత పాఠశాలలోని 65 విద్యార్థులకు పీఆర్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం స్కూల్ యూనిఫాంను అందజేశారు. యూనిఫాం అందజేసిన పీఆర్ఆర్ చైర్మన్ రాంరెడ్డిని ఉపాధ్యాయులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు అర్జున్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గుండెపోటుతో జర్నలిస్టు మృతి


అనిల్‌కుమార్ (ఫైల్)

సంగారెడ్డి క్రైం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : గుండెపోటుతో ఓ పత్రిక మెదక్ డెస్క్ ఇన్‌చార్జి అనిల్ కుమార్ మృతిచెందాడు. గురువారం సాయంత్రం కార్యాలయంలో పనిచేస్తున్న క్రమంలో గుండెపోటు రావడంతో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య ఉన్నారు. అనిల్ కుమార్ మృతిపట్ల పలువురు జర్నలిస్టు సంఘాలు సంతాపం ప్రకటించాయి.

సమతుల్య ఆహారంతో రోగాలు దూరం

చిలప్‌చెడ్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : సమతుల్య ఆహారం తీసుకుంటే రోగాలు దరిచేరవని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంతోషిమాత పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రమైన చిలప్‌చెడ్ హైస్కూల్‌లో విద్యార్థులకు సమతుల్య ఆహారంపై నిర్వహించిన అవగాహనా కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. విద్యార్థులకు డ్రాయింగ్, సమతుల్య ఆహారంపై వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌పిలు సునిల్, వెంకటేశం చౌహాన్, కాంప్లెక్స్ హెచ్‌ఎం ధనమూర్తి, చండూరు హెచ్‌ఎం రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అన్నిరంగాల్లో రాణించేలా కృషి చేయాలి: ఎంఈవో

హవేళిఘణపూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులు విద్యలో వెనకబడిన విద్యార్థులను అన్నివిధాలుగా సంసిద్ధులు చేయాలని ఎంఈవో మధుమోహన్ తెలిపారు. శుక్రవారం మండలంలోని గాజిరెడ్డిపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం, రికార్డులను పరిశీలించి మాట్లాడారు. ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం, వెనకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు.

అనుమతులు లేకుండా పనులు చేస్తే చర్యలు

ఝరాసంగం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని చీలపల్లి గ్రామ శివారులో వెంచర్‌లో కొనసాగుతున్న పనులను గురువారం తహసీల్దార్ తిరుమలరావు పరిశీలించారు. అనుమతులు లేకుండా పనులు చేస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నాలా కన్‌వర్షన్‌పై అక్కడున్న సిబ్బందిని ఆరాతీయగా.. సరైన సమాధానం ఇవ్వకపోవడంతో ఈ వెంచర్‌కు సంబంధించిన పూర్తిస్థాయి పత్రాలను కార్యాలయానికి తీసుకరావాలని ఆదేశించారు. ఆయన వెంట ఆర్ఐ సాయికిరణ్, సిబ్బంది లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయుల హర్షం

చిన్నశంకరంపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం హెచ్‌ఎంలు, ఎస్జీటీ ఉపాధ్యాయులకు పర్యవేక్షణ బాధ్యతలను అప్పగించడం హర్షణీయమని పీఎస్ హెచ్‌ఎంల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గాలయ్య అన్నారు. గురువారం చిన్నశంకరంపేట మండలం గజగట్లపల్లి పాఠశాల వద్ద గ్రీన్ బ్యాడ్జీలు ధరించి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల నుంచి ఎదురు చూస్తున్న కల నెరవేరిందన్నారు.

సీజేఐపై దాడికి ఖండన

మెదక్ కల్చరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : సుప్రీంకోర్టు సీజేఐ బీఆర్ గవాయ్‌పై జరిగిన దాడిని ఎమ్మార్పీఎస్ నాయకులు ఖండించారు. గురువారం మెదక్ జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో భవనంలో ఎమ్మార్పీస్ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించి మాట్లాడారు. రాజ్యాంగ విలువలను అవమానపరిచే ఘోర సంఘటన అని ఎమ్మార్పీఎస్ మెదక్ జిల్లా అధ్యక్షుడు చెట్లపల్లి యాదగిరి, కార్య నిర్వాహక అధ్యక్షుడు అస్తరుగల బాలరాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రవి అన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

వెల్దుర్తి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను వెల్దుర్తి పోలీసులు పట్టుకున్నారు. మండల పరిధిలోని హస్తాల్‌పూర్ నుంచి గురువారం అర్ధరాత్రి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్నారన్న సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి ట్రాక్టర్‌ను పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. అయితే ట్రాక్టర్ ఇంజన్‌కు, ట్రాలీకి ఎలాంటి రిజిస్ట్రేషన్ నంవబర్లు లేవు. ఇసుకను తరలిస్తున్నారని 100కు గ్రామస్థులు ఇచ్చిన సమాచారంతో వెళ్లి పట్టుకున్నట్లు సమాచారం.

తలాపునే మంజీర.. అయినా తీరని దాహార్తి

(3వ పేజీ తరువాయి)

ఇంజనీర్లు ట్రాన్స్‌ఫార్మర్ వాడకం నిలిపివేశారు. దీంతో, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయలేకపోతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ వినియోగంలోకి తెచ్చి పంప్ హౌస్ ద్వారా నీరు పంపింగ్ చేసి పట్టణ ప్రజలకు అందించాలని ప్రయత్నిస్తున్నారు. కానీ, కరెంటు కనెక్షన్ ఇవ్వడంలో విద్యుత్ అధికారులు తీవ్ర జాప్యం చేస్తున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే భవిష్యత్తులో ప్రాజెక్టులో నీటి నిల్వలు తగ్గితే పరిస్థితి ఎలా ఉంటుందోనని ఆందోళన చెందుతున్నారు.

సమయపాలన పాటించని ఉపాధ్యాయులు


ఉపాధ్యాయుల కోసం వేచిచూస్తున్న విద్యార్థులు

నాగలిగిద్ద, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని శ్యామ్‌నాయక్ తండా, బిక్కుతండాల్లో ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వర్తించే ఉపాధ్యాయులు సమయపాలన పాటించడం లేదు. మధ్యాహ్నం వరకే విధులు నిర్వర్తించి వెళ్లిపోతున్నారు. ఉపాధ్యాయులు తరచూ విధులకు గైర్హాజరవుతున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెగ్యులర్‌గా విధులకు హాజరై ఉపాధ్యాయులను నియమించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

అభివృద్ధి చేస్తేనే ఉన్నత పాఠశాలల మనుగడ

- ఎస్టీటీయూ జిల్లా అధ్యక్షుడు జింక అశోక్

తూప్రాన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక పాఠశాలలను అభివృద్ధి చేస్తేనే ఉన్నత పాఠశాలల మనుగడ ఉంటుందని ఎస్టీటీయూ మెదక్ జిల్లా అధ్యక్షుడు జింక అశోక్ పేర్కొన్నారు. గురువారం తూప్రాన్ మండలంలో సభ్యత్వ నమోదు చేపట్టి మాట్లాడారు. ప్రాథమిక పాఠశాలలను విస్మరించి జీహెచ్‌ఎం, పీఈటీ పోస్టుల కోసం ఎస్జీటీ పోస్టులను తగ్గించాలని చూడటం అన్యాయమన్నారు. ప్రాథమిక పాఠశాలలో తరగతి గదికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలని, ఒక హెడ్‌మాస్టర్‌ను కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యక్ష, కార్యదర్శులు గాంధీ, యాదగిరి, ఉపేందర్, నర్సింలు, దత్తు పాల్గొన్నారు.

మిలిటరీ ఇంజనీరింగ్ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా రఘునాథం

సంగారెడ్డి టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : మిలిటరీ ఇంజనీరింగ్ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా వడిగెపల్లి రఘునాథంముదిరాజ్(ఇస్మాయిల్‌ఖాన్‌పేట) ఎన్నికయ్యారు. గురువారం సంగారెడ్డి పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా బుస్సా రాములు(పటాన్‌చెరు), ప్రధాన కార్యదర్శిగా గొడుగు బాలరాజుముదిరాజ్(ఫసల్‌వాది), సంయుక్త కార్యదర్శిగా బస్వాపురం బాశయ్య(శేరిరాంరెడ్డిగూడెం), కోశాధికారిగా బోయిని మాణయ్య(సంగారెడ్డి), కార్యవర్గ సభ్యుడుగా నక్కల వెంకన్న(కొత్లాపూర్)ను ఎన్నుకున్నారు. మిలిటరీ ఇంజనీరింగ్ రిటైర్డ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై కలసికట్టుగా ఉద్యమించాలని సమావేశంలో తీర్మానించారు. కేంద్ర ప్రభుత్వం అందజేయాల్సిన బెనిఫిట్స్‌పై త్వరలో కార్యాచరణ రూపొందించనున్నట్లు ప్రధాన కార్యదర్శి గొడుగు బాలరాజుముదిరాజ్ తెలిపారు.

రోడ్డు మరమ్మతులు చేయాలి : సీపీఎం

వెల్దుర్తి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన వెల్దుర్తి నుంచి జిల్లా కేంద్రమైన మెదక్‌కు వెళ్లే ప్రధాన రహదారిపై పెద్ద పెద్ద గోతులు ఏర్పడి ప్రమాదకరంగా ఉన్నాయని, వెంటనే మరమ్మతులు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి గౌరీ అన్నారు. గురువారం మెదక్ నుంచి వెల్దుర్తికి వస్తున్న బస్సు శెట్‌పల్లి సమీపంలోని పీఏసీఎస్ గోదాం వద్ద గుంతలో పడి చెడిపోయి రోడ్డుపై నిలిచిపోయింది. దీంతో గౌరీ ఆధ్వర్యంలో పలువురు నాయకులు బస్సు ఎదుట ధర్నా నిర్వహించారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి రెండు వరుసల రోడ్డును నిర్మించాలని వారు డిమాండ్ చేశారు.

విద్యార్థుల తోడ్పాటుకు కృషి చేస్తా


విద్యార్థులకు యూనిఫామ్స్ అందజేసిన మహేష్‌గుప్తా

శివ్వంపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల తోడ్పాటుకు ఎల్లవేళలా కృషి చేస్తానని మాజీ జడ్పీటీసీ, ఆర్థిక ప్రణాళిక సంఘం మాజీ సభ్యుడు మహేష్‌గుప్తా అన్నారు. మండల కేంద్రమైన శివ్వంపేటకు చెందిన ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన 150 మంది విద్యార్థులకు గురువారం తన సొంత నిధులతో యూనిఫాం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రమణాగౌడ్, మన్సూర్, శ్రీనివాస్‌గౌడ్, వెంకటేష్ పాల్గొన్నారు.

విద్యుత్ సబ్‌డివిజన్ అధ్యక్షుడిగా జనార్దన్

పాపన్నపేట, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి) : పాపన్నపేట విద్యుత్ సబ్ డివిజన్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా రేగోడు జనార్ధన్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా బీల్యానాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్లుగా గోపాల్, ప్రభాకర్, విఠలరెడ్డి, ట్రెజరీగా ప్రమోద్, అడ్వైజర్లుగా షాదుల్లా, ప్రవీణ్, మహిళా కార్యదర్శిగా వినోదను ఎన్నుకున్నట్లు తెలిపారు. పాపన్నపేట సెక్షన్ అధ్యక్ష, కార్యదర్శిగా సదాశివరావు, బసవరాజ్‌స్వామి, రేగోడు సెక్షన్ అధ్యక్ష, కార్యదర్శులుగా మిట్టల్‌దాస్, కిషన్‌నాయక్, అల్లాదుర్గం సెక్షన్ అధ్యక్ష, కార్యదర్శులు నర్సింలు, అంజయ్య, టెక్మల్ సెక్షన్ అధ్యక్ష, కార్యదర్శులు యాదగిరి, రాజు ఎన్నుకున్నారు.

రేపటి బంద్‌ను విజయవంతం చేయండి

మెదక్ అర్బన్/హవేళిఘణపూర్/గుమ్మడిదల/సంగారెడ్డి రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థ ఎన్నికల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్లను కొందరు అడ్డుకునన్నందుకు నిరసనగా ఈ నెల 18న నిర్వహించే బంద్‌ను విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నోములు శ్రీకాంత్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక టీఎన్జీవో భవన్‌లో ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ బంద్ విజయవంతం చేయాలి. 18న నిర్వహించే బంద్‌ను విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం మెదక్ జిల్లా అధ్యక్షుడు నోముల శ్రీకాంత్, నియోజకవర్గం అధ్యక్షుడు సాప రవి తెలిపారు. గురువారం వారు హవేళిఘణపూర్ మండలంలో మాట్లాడారు. గుమ్మడిదలలో నిర్వహించిన సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకుడు డొంగ్లి శ్రీనివాస్ మాట్లాడారు. బీసీ బంద్‌కు సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మల్లేశం, సాయిలు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎంఏ.రహ్మాన్, ఫోరం ఫర్ బెటర్ సంగారెడ్డి అధ్యక్షుడు శ్రీధర్ మహేంద్ర, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సురేష్ సంపూర్ణ సంఘీభావం తెలిపారు.

సత్యనారాయణకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు

గుమ్మడిదల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా లీడ్ ఇండియా-2025లో భాగంగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను అందజేశారు. ఈ అవార్డును హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో లీడ్ ఇండియా చైర్మన్ డా.సుదర్శన్ ఆచార్య చేతులమీదుగా గుమ్మడిదల ఉన్నత పాఠశాల ఉపాధ్యాకుడు డా.వేముల సత్యనారాయణ అందుకున్నారు. విద్యారంగంలో విశిష్ట సేవలందించినందుకు అవార్డు లభించిందని నిర్వాహకులు తెలిపారు.